తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 147 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ శుక్రవారం 27-12-2024 వెల: 5/రూ -



## ఆర్థిక వేత్త

# అస్తమయం



- వృద్ధాప్య సమస్యలతో మాజీ ప్రధాని తుదిశ్వాస
- గురువారం రాత్రి 9:51 గంటలకు ఎయిమ్స్‌లో మృతి
- హుటాహుటిన ఆస్పత్రికి సోనియాగాంధీ, ప్రియాంక
- బెళగావి నుంచి ఢిల్లీకి చేరుకున్న రాహుల్ గాంధీ, ఖర్గే
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం
- అధికారిక లాంఛనాలతో మన్మోహన్ అంత్యక్రియలు

ఏడు రోజులు సంతాపదినాలుగా ప్రకటించిన కేంద్రం

2లో

మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగారు. దేశ ప్రజల జీవితాలను మెరుగు పరిచేందుకు విశేష కృషి చేశారు

– నరేంద్ర మోదీ

దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని దేశం కోల్పోయింది. ఆయన ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి.

– మల్లికార్జున ఖర్గే

గురువును, మార్గదర్శకుడిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో ఆయన దేశాన్ని నడిపించారు

– రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, : దేశ రాజకీయ యవనికపై ఒక శకం ముగిసింది! కుదేలైన భారత ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మంత్రిగా గాడిలో పెట్టిన సంస్కరణల రూపశిల్పి.. ప్రధానిగా ప్రగతిపథంలో పరుగులు తీయించిన ఆర్థికవేత్త ఇక లేరు!! మౌనమే భాషగా ఉంటూనే రెండు పర్యాయాలు.. దేశాన్ని సమర్థంగా పరిపాలించిన రాజనీతిజ్ఞుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం సాయంత్రం తన నివాసంలో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రాత్రి 8.06 గంటల సమయంలో కుటుంబసభ్యులు ఆయన్ను ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు ఆయనను కాపాడడానికి ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని... రాత్రి 9:51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ఆస్పత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. మన్మోహన్‌సింగ్‌కు భార్య గురుచరణ్, ముగ్గురు కుమార్తెలు ఉపీందర్, అమృత్,

## జనగణనలో కులగణన

- దేశవ్యాప్తంగా కులగణన కోసం కాంగ్రెస్ పోరాడాలి
- సీడబ్ల్యూసీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి.. సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన సీడబ్ల్యూసీ
- జనాభా ప్రకారం పునర్విభజన జరిగితే దక్షిణాదికి అన్యాయమన్న సీఎం

2లో




## మరోస్థాయికి టాలీవుడ్!

- ఐటీ, ఫార్మాతో పాటు చిత్ర పరిశ్రమ కూడా మాకు ముఖ్యమే
- త్వరలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ సినీ సదస్సు... చిత్ర పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం
- శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా సహించం... తెలుగు సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రి భేటీ
- గైర్హాజరైన అగ్ర నటుడు చిరంజీవి



2లో

హైదరాబాద్: తెలుగు చలనచిత్ర పరిశ్రమను మరో స్థాయికి తీసుకెళ్లి అంతర్జాతీయంగా ఒక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఐటీ, ఫార్మాతో పాటు చిత్ర పరిశ్రమ కూడా తమకు ముఖ్యమేనన్నారు. విశ్వనగరాల్లో హైదరాబాద్ అత్యుత్తమమైనదని, హాలీవుడ్, బాలీవుడ్‌లు హైదరాబాద్‌కు తరలివచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలో హైదరాబాద్‌లో భారీ అంతర్జాతీయ సినీ సదస్సు ఏర్పాటు చేసి ఇతర చిత్ర పరిశ్రమలను ఆకట్టుకునే ఏర్పాట్లు చేస్తామన్నారు.సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్

## జగన్ అవినీతి వల్లే విద్యుత్ చార్జీల భారం

దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి: అచ్చెన్నాయుడు

2లో

## గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక సబబే

- స్పష్టం చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్
- జీవో 29పై దాఖలైన పిటిషన్ల కొట్టివేత
- గ్రూప్-1 పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకి



## కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమ పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ధ్వజం

2లో

హైదరాబాద్: రేవంత్ పాలనలో ఇందిరమ్మ రాజ్యం పేరిట ఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించి.. ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం

# కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ

(మొదటి పేజీ తరువాయి)

దుర్మార్గమని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందున ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై కక్షతో అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకోలేక నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కనీసం నోటీసు ఇవ్వకుండా గురువారం తెల్లవారు జామున పోలీసులు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇంటికి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారని ధ్వజమెత్తారు. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలనే విష సంస్కృతికి చరమగీతం పాడాలన్నారు.

**ఇందిరమ్మ రాజ్యమా? పోలీస్ రాజ్యమా? : హరీశ్‌రావు**

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన పేరిట డబ్బా కొడుతూ, సీఎం రేవంత్ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడేది లేదని, తెలంగాణ సమాజమే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మేడే రాజీవ్ సాగర్, డాక్టర్ వాసుదేవరెడ్డి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును ఖండించారు.

# జనగణనలో కులగణన



హైదరాబాద్, : కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన గణనలో కులగణన కూడా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కులగణనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బెళగావిలో గురువారం జరిగిన సీడబ్ల్యూసీ సదస్సులో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కులగణన చేపట్టడం ద్వారా తెలంగాణ దేశానికే మార్గదర్శిగా మారిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టనున్న జన గణనలో కులగణన కూడా చేయాలంటూ కాంగ్రెస్ పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ ఒక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఆయన ప్రతిపాదన మేరకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. త్వరలో చేప్టటనున్న నియోజకవర్గాల పునర్విభజనలోనూ ఏఐసీసీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో ఏఐసీసీ వ్యూహాత్మకంగా వ్యవహరించి, జాగ్రత్తగా ముందడుగు వేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో దానిపై కాంగ్రెస్ పార్టీనే ఎక్కువగా ప్రచారం చేసుకోవాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. మహిళా బిల్లును కూడా బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశాలున్నందున కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలతో చేపట్టాలని నిర్ణయించిన కులగణనతో దేశంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కులాలు, మతాల పేరిట రాజకీయాలు చేస్తూ దేశాన్ని విభజించి పాలిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ ఎత్తుగడలకు కులగణన చెంపపెట్టు లాంటిదని చెప్పారు. కులగణనకు అత్యంత ప్రాధాన్యమిచ్చి, దాన్ని చేపట్టడం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సీడబ్ల్యూసీ సదస్సులో మహేశ్‌కుమార్ గౌడ్ ప్రసంగించారు. తెలంగాణలో కుల గణన సర్వే ఇప్పటికే 90 శాతం పూర్తయిందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని, చరిత్రను తిరగరాయలని చూస్తోందని మండిపడ్డారు. ఇలాంటి తరుణంలో దేశానికి సేవలు, త్యాగాలు చేసిన కాంగ్రెస్ పార్టీ త్యాగ పురుషుల జీవితాలను నేటి తరానికి వివరించాల్సి ఉందని అన్నారు. సరిగ్గా వందేళ్ల క్రితం ఇదే బెళగావిలో మహాత్మాగాంధీని సీడబ్ల్యూసీ ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని గుర్తుచేశారు. ఆ తర్వాత ఏ పదవినీ స్వీకరించకపోయినప్పటికీ గాంధీజీ పాటించిన విలువలు, ఆదర్శప్రాయమైన జీవనం కారణంగా ప్రపంచమంతా ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తోందని కొనియాడారు.

# ఆర్థిక వేత్త అస్తమయం



(మొదటి పేజీ తరువాయి)

దమన్ ఉన్నారు. మన్మోహన్‌ను ఆస్పత్రిలో చేర్పించారన్నవార్త తెలిసిన వెంటనే.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ హుటాహుటిన ఎయిమ్స్‌కు చేరుకుని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇక.. కర్ణాటకలోని బెలగావీలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ.. మన్మోహన్ మరణవార్త తెలియగానే ఢిల్లీకి పయనమయ్యారు. ఆయన గౌరవార్థం.. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సహా వచ్చే ఏడు రోజులపాటు నిర్వహించతలపెట్టిన అన్ని కార్యక్రమాలనూ రద్దు చేసుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 2025 జనవరి 3న పార్టీ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమవుతాయని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. అప్పటిదాకా పార్టీ జెండాను అవనతం చేస్తామని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా.. మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని గురువారం రాత్రే ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి ఆయన నివాసానికి తరలించారు. మన్మోహన్ మృతిపట్ల సంతాపం తెలిపిన ప్రధాని మోదీ.. ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ ఏర్పాట్లపై చర్చించేందుకు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. కాగా.. ఆయన గౌరవార్థం కేంద్రం ఏడురోజులు జాతీయ సంతాపదినాలుగా ప్రకటించింది.

**మోహనా.. మోహనా..**

నెహ్రూ అంతటి వ్యక్తే స్వయంగా పిలిచినా.. 'నేను పాఠాలు చెప్పుకొంటాను తప్ప, రాజకీయాల్లోకి రాను' అన్న మన్మోహన్.. ప్రస్తుత పాకిస్థాన్‌లోని గహ్‌లో 1932 సెప్టెంబరు 26న గురుముఖ్ సింగ్ కోహ్లీ, అమృత్‌కౌర్ దంపతులకు జన్మించారు. చిన్నవయసులోనే తల్లి చనిపోవడంతో.. మన్మోహన్ తన అమ్మమ్మ జమ్నాదేవి వద్దే పెరిగారు. చిన్నతనంలో అందరూ ఆయనను ముద్దుగా మోహనా.. మోహనా అని పిలిచేవారు. ఆయన పెరిగిన ఊళ్లో స్కూలు కూడా లేదు. రోజూ స్నేహితుడితో కలిసి 5 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్నారు. పదో ఏడు వచ్చేదాకా ఆయన విద్యాభ్యాసం ఉర్దూ మాధ్యమంలోనే జరిగింది. అందుకే.. ఆయన జీవితమంతా తన హిందీ ప్రసంగాలను కూడా ఉర్దూలోనే రాసుకుని చదివేవారు (కొన్నికొన్నిసార్లు తన మాతృభాష అయిన పంజాబీలో రాయడానికి గురుముఖి లిపిని వాడేవారు). దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పాకిస్థాన్ నుంచి ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరానికి వచ్చింది. ఆ తర్వాత ఏడాదికే.. అంటే 1948లో అమృత్‌సర్‌కు వెళ్లి అక్కడ స్థిరపడింది. మన్మోహన్ అక్కడే హిందూ కాలేజీలో చేరారు. పంజాబ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ (1952లో), పీజీ (1954లో) పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జి వర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ఆనర్స్ పూర్తిచేశారు. పాఠశాల స్థాయి నుంచి కేంబ్రిడ్జి దాకా.. చదువులో ఆయన ఎప్పుడూ టాపరే. స్కాలర్‌షిప్పుతోనే ఆయన చదువులన్నీ సాగాయి. డాక్టరేట్ చేసిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే. మానవ జీవితాలను రాజకీయాలు ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని తాను కేంబ్రిడ్జి వర్సిటీలో ఉన్న రోజుల్లోనే తెలుసుకున్నానని మన్మోహన్ 2005లో ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కేంబ్రిడ్జిలో ఉన్నత విద్య పూర్తిచేసుకున్న అనంతరం భారతదేశానికి తిరిగివచ్చిన ఆయన.. పంజాబ్ వర్సిటీలో విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మళ్లీ 1960లో ఇంగ్లండ్‌కు వెళ్లి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో డీఫిల్ చేశారు. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ పెర్ఫార్మెన్స్, 1951-1960, ఎక్స్‌పోర్ట్ ప్రాస్పెక్ట్స్ అండ్ పాలసీ ఇంప్లికేషన్స్' అనే అంశంపై డాక్టోరల్ థీసిస్ రాశారు. దరిమిలా ఆ థీసిస్ ఆధారంగానే.. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సస్టెయిన్డ్ గ్రోత్' అనే పుస్తకం రాశారు. డీఫిల్ పూర్తయ్యాక మళ్లీ ఇండియాకు తిరిగొచ్చి పంజాబ్ వర్సిటీలో రీడర్‌గా పనిచేశారు. 1963 నుంచి 1965 దాకా ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా వ్యవహరించారు. 1966 నుంచి 1969 దాకా 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్'కు పనిచేశారు. ఆర్థికవేత్తగా ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ఎంపీ లలిత్‌నారాయణ్ మిశ్రా.. ఆయన్ను విదేశీ వాణిజ్య శాఖలో సలహాదారుగా నియమించారు. బ్యూరోక్రాట్‌గా మన్మోహన్ ప్రస్థానం అలా ప్రారంభమైంది. 1969 నుంచి 1971 దాకా 'ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో ప్రొఫెసర్‌గా అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన పాఠాలు బోధించారాయన. 1972లో ఆర్థిక శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారుగా.. 1976లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1980-1982 నడుమ ప్రణాళిక సంఘంలో పనిచేసిన మన్మోహన్‌ను.. 1982లో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమించారు. 1985 దాకా ఆయన ఆ పదవిలో కొనసాగారు. 1985-87 నడుమ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1987 నుంచి 1990 దాకా జెనీవాలోని ఎకనమిక్ పాలసీ థింక్ ట్యాంక్ 'సౌత్ కమిషన్'కు సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించారు. 1990 నవంబరులో భారత్‌కు తిరిగొచ్చి.. అప్పటి ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 1991లో ప్రభుత్వం ఆయన్ను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. 1991 జూన్‌లో.. మైనారిటీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నాటి ప్రధాని పీవీ నరసింహారావు దేశాన్ని సంస్కరణల పథంలో నడపాలంటే మన్మోహన్ వంటి ఆర్థికవేత్త అవసరమని భావించి ఆయనకు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు! తొలుత ఆ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా మన్మోహన్‌కు పీవీ తెలియపరచగా.. ఆయన దాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. దాంతో పీవీ.. వెంటనే చక్కగా తయారై రాష్ట్రపతి భవన్‌కు రావాలంటూ మన్మోహన్‌ను ఆదేశించారు.

# మరోస్థాయికి టాలీవుడ్!

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్ (ఐసీసీసీ)లో తెలుగు సినీ ప్రముఖులతో సీఎం సమావేశమయ్యారు. పుష్ప%-%2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా నటుడు అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు రాగా అభిమానులు ఎగబడడంతో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో కోలుకుంటున్న విషయం తెలిసిందే. కాగా సీఎం రేవంత్ జరిపిన ఈ భేటీకి టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవి గైర్హాజరు కావడం విశేషం. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

**తొక్కిసలాటలకు చిత్ర యూనిట్‌దే బాధ్యత**

'తెలుగు సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలపై సినీ ప్రముఖులతో చర్చించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తాం. చిత్ర పరిశ్రమ తరఫున కూడా ఓ కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమాల్లో ఎలాంటి తొక్కిసలాట జరిగినా అందుకు సంబంధిత చిత్ర యూనిట్‌దే పూర్తి బాధ్యత. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా సహించేది లేదు. అలా చేసే వారెవరికీ మినహాయింపులుండవు. రాష్ట్రంలో షూటింగ్‌లకు అనుమతులిస్తాం. తెలంగాణలో ప్రకృతి, ధార్మిక పర్యాటకాన్ని టాలీవుడ్ ప్రోత్సహించాలి. ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య అనుసంధానకర్తగా ఉండేందుకే దిల్ రాజును ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమించాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'నాకు వ్యక్తిగతంగా ఇష్టాయిష్టాలు లేవు. సీఎంగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. సినీ పరిశ్రమ కూడా బాధ్యతాయుతంగా మెలగాలి. అల్లు అర్జున్‌పై నాకెందుకు కోపం ఉంటుంది? బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. వ్యక్తిగత అభిప్రాయాలు ఎలా ఉన్నా, చట్టం ప్రకారం వ్యవహరించాలన్నది నా విధానం. సినీ ప్రముఖులు ఏర్పాటు చేసుకుంటున్న బౌన్సర్ల దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోము. అభిమానులను నియంత్రణలో పెట్టుకోవాల్సింది నటులే. గంజాయి, డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలకు కూడా నటీనటులు సహకరించాలి. డ్రగ్స్, మహిళల భద్రత విషయంలో యువతకు అవగాహన కల్పించేలా లఘు చిత్రాలు చిత్రీకరించి సినిమాకు ముందు విధిగా థియేటర్లలో ప్రదర్శించాలి. సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..' అని సీఎం ఆకాంక్షించారు.

**సినీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వాలు మేలు చేశాయి..**

'సినీ పరిశ్రమకు ఏది చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. సినీ స్టూడియోలకు స్థలాలు, నిర్మాణాలకు అనుమతులు, ఇళ్ల స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీల ఏర్పాటు, కార్మికులకు ఇళ్లు, ఇతర సౌకర్యాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇచ్చాయి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాం. సినీ పరిశ్రమకు అండగా ఉండి ప్రోత్సహించాలన్నది మా ఉద్దేశం. 8 సినిమాలకు మా ప్రభుత్వం ప్రత్యేక అనుమతులతో జీవోలిచ్చింది. పుష్ప సినిమాకు పోలీస్ గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు సినీ పరిశ్రమ తెలుగు సినిమాలకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణం చేపట్టేలా అందరం కలిసి అభివృద్ధి చేద్దాం..' అని రేవంత్ అన్నారు. 'రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నాం. ఒక్కో పాఠశాల పూర్తికి రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం. దీనికోసం సినీ పరిశ్రమ నుంచి కొంత టికెట్లపై సెస్ రూపంలో ఆర్థిక వనరులు సమకూర్చాలని అనుకుంటున్నాం. ఇదో బృహత్తర కార్యక్రమం. ఇందుకు సినీ పరిశ్రమ సహకరించాలి..'

# గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక సబబే

హైదరాబాద్, : గ్రూప్%-%1 మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసిన విధానం సబబేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. జీవో 55 స్థానంలో జీవో 29 అమలును.. మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. గ్రూప్%-%1 చుట్టూ అలుముకున్న వివాదాలకు ముగింపు పలికి.. ఎంపిక ప్రక్రియకు అడ్డంకులను తొలగించింది. జీవో 29 అమలు, జీవో 96, తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్%-%1996లోని రూల్ 22(2)(ఏ), (బీ) చట్టబద్ధతను సవాల్ చేస్తూ.. దాఖలైన ఎనిమిది వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణిల డివిజన్ బెంచ్ గురువారం తుది తీర్పునిచ్చింది. పిటిషన్ దాఖలులో 'ఆలస్యం' కారణంగా హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్, సుప్రీంకోర్టు కొట్టివేసిన అంశంపై మళ్లీ విచారణ జరపడం సబబు కాదని వ్యాఖ్యానించింది. "2024 ఫిబ్రవరి 19న కొత్త నోటిఫికేషన్ జారీ అయ్యాక.. దాదాపు ఆర్నెల్ల తర్వాత సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని సింగిల్ జడ్జి ధర్మాసనం అక్టోబరు 15న కొట్టివేసింది. వాటిపై అప్పీళ్లను అక్టోబరు 18న డివిజన్ బెంచ్ కొట్టివేసింది. పిటిషనర్లు సుప్రీంకోర్టును



ఆశ్రయించగా.. ఈ నెల 6న కొట్టివేసింది. సింగిల్‌బెంచ్ 'ఆలస్యం' అనే కారణాన్ని స్పష్టంగా పేర్కొన్నాక.. ఇప్పుడు మరింత ఆలస్యం జరిగింది. ఒకసారి తీవ్ర ఆలస్యంపై నిర్ధారణ జరిగాక.. మళ్లీ అదే అంశంపై విచారణ సబబు కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పదిరోజుల క్రితం వాదనల సందర్భంగా.. "గతంలో హైకోర్టు ప్రాథమిక పరీక్షను మళ్లీ నిర్వహించాలని చెప్పిందే తప్ప.. పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వమని చెప్పలేదు. పాత దాన్ని రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా పోస్టులను 503 నుంచి 563కు పెంచారు. గేమ్ రూల్స్‌ను మధ్యలో మారుస్తూ.. చట్టవిరుద్ధంగా జీవో 29ను తీసుకొచ్చారు. గతంలో జీవో 55ని సమర్థించిన ప్రభుత్వం.. ఇప్పుడు జీవో 29ను అమలు చేయడం చెల్లదు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థికి ఎక్కువ మార్కులు వస్తే జనరల్ కోటాలో బెర్త్ దక్కాలి. మధ్యలో రూల్స్‌ను మార్చడం వల్ల 1:50 నిష్పత్తికి విరుద్ధంగా ఎక్కువ మంది అభ్యర్థులు మెయిన్స్‌కి ఎంపికయ్యారు" అని పేర్కొన్నారు. ప్రభుత్వం, టీజీపీఎస్సీ తరఫున న్యాయవాదులు తమ వాదనలను వినిపిస్తూ.. కొత్త ప్రభుత్వం ఇచ్చిన కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్లను హైకోర్టు సింగిల్, డివిజన్ బెంచ్‌లు, సుప్రీంకోర్టు కొట్టేసిన తర్వాత.. మళ్లీ వివాదానికి తావులేదని పేర్కొన్నారు. "కొత్త ప్రభుత్వం జారీచేసిన జీవో 29.. సుప్రీంకోర్టు 'బాలోజీ బదావత్' కేసులో ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా.. చట్టానికి లోబడి ఉంది. కోర్టు తీర్పులకు అనుగుణంగానే 1967 నుంచి కొత్త జీవోలు వస్తున్నాయి. జనరల్ విభాగంలో ఎంపికైన చిట్టచివరి వ్యక్తి కంటే.. రిజర్వుడు అభ్యర్థికి ఎక్కువ మార్కులు వస్తే.. సదరు అభ్యర్థికి కచ్చితంగా జనరల్ విభాగంలోనే బెర్త్ దక్కుతుంది" అని స్పష్టంచేశారు.

# జగన్ అవినీతి వల్లే విద్యుత్ చార్జీల భారం

అమరావతి, గత సీఎం జగన్మోహన్‌రెడ్డి అడ్డగోలుగా అవినీతికి పాల్పడటం వల్లే రాష్ట్రంలో ప్రజల నడుం విరిగేలా విద్యుత్ చార్జీలు పెరిగాయని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. దీనిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన వైసీపీకి సవాల్ విసిరారు. గురువారం ఆయన ఇక్కడ ఒక ప్రకటన చేశారు. 'ఐదేళ్లపాటు ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని చార్జీలపై ధర్నాలు, ర్యాలీలకు పిలుపు ఇస్తున్నారు? ఐదేళ్లపాటు సీఎం పదవిలో కూర్చుని అవినీతి సంపాదనకు అలవాటు పడిన జగన్ ఆ సంపాదన లేకుండా ఐదు నెలలు కూడా ఉండలేకపోతున్నారు. ఆ అక్కసుతోనే తమ కేడర్‌తో నిరసన కార్యక్రమాలు చేయిస్తున్నారు. 2022-24 మధ్య కాలంలో విద్యుత్ వాడకానికి సంబంధించి కరెంటు చార్జీలు పెంచాలని ఆయన ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు ప్రతిపాదనలు పంపి ఆమోదం తీసుకొంది. రెగ్యులేటరీ కమిషన్ ఆమోదించడం వల్లే పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. అవే ఇప్పుడు బిల్లుల్లో వస్తున్నాయి. చార్జీలు తాను పెంచి వాటికి వ్యతిరేకంగా తానే ధర్నాలు చేయడం ఒక్క జగన్‌కే చెల్లింది.

# కొండకల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ





ముఖ్య అతిథులు గా ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంధాలయం చైర్మన్ మధుసూదన్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రం కోసం రేవంత్ రెడ్డి కష్టపడుతున్న విధంగా మన గ్రామాల అభివృద్ధి కోసం మనం అలాగే కష్టపడాలి

**శంకరపల్లి డిసెంబర్ 26:(డైలీ రిపోర్ట్):** శంకర్పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కుపల్లి మహిపాల్ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండకల్ గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కాలే యాదయ్య ,గ్రంథాలయం చైర్మన్ మధుసూదన్ లకు ఘన స్వాగతం పలికి, ర్యాలిని నిర్వహించారు. గ్రామంలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మరియు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.. కాలే యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి కష్టపడే విధంగా మన గ్రామాల అభివృద్ధి కోసం మనం కూడా అంతే కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తలకు పార్టీ అండగా ఉండి ఉన్నత స్థాయికి ఎదిగేలా చేస్తుంది పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్,యూత్ మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి , వివిధ మండలాల యూత్ అధ్యక్షులు,గ్రామ అధ్యక్షుడు రామ లక్ష్మణ్, గ్రామ మాజీ సర్పంచ్ కాశీనాథ్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ వడ్ల శ్రీహరి, గ్రామ యూత్ అధ్యక్షుడు వెంకట్ రాజు ,కొండకల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు



# కేవల్ కిషన్ స్పూర్తితో ఉద్యమిద్దాం

## కేవల్ కిషన్ గారి 64వ వర్ధంతి సభ

కంది మండల కేంద్రంలో కామ్రేడ్ కేవల్ కిషన్ గారి 64వ వర్ధంతి సభను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు మాట్లాడుతూ... కేవల్ కిషన్ గారు జీవితాంతం పేద ప్రజల కొరకు ఉద్యమించి తన జీవితాన్ని తృణప్రాయంగా ప్రజల కోసం అంకితం చేసిన గొప్ప నాయకుడని,అతనికి నివాళి అర్పించడం అంటే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడడమేనని అన్నారు.తాను తహసిల్దార్ గా ఉన్నప్పుడు పేద ప్రజల కోసం భూములు, ఇండ్ల స్థలాలు ఇవ్వడంతో నాటి ప్రభుత్వాలు అతనిపై ఒత్తిడి తేవడం వలన తహసీల్దార్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల పక్షాన నికరంగా పోరాడినటువంటి కామ్రేడ్ కేవల్ కిషన్ గారి స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.1960 సంవత్సరంలో తాను మరణించినటువంటి నేటి రోజును ప్రజలు పెద్ద జాతరగా నిర్వహిస్తారని కొనియాడారు. నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమించాలని,ప్రజా సమస్యల పరిష్కారించడం తోనే కేవల్ కిషన్ గారికి నిజమైన నివాళులర్పించిన వాళ్ళమవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు సిహెచ్. నరసింహులు,యం.ఆనంద్, జి.మమత,షబానా, నసీమా,సునంద,మంజుల, సమీనా తదితరులు పాల్గొన్నారు.



# శంకర్‌పల్లి అయ్యప్ప ఆలయంలో ఘనంగా పదునెట్టాంబడి పూజ

**శంకర్పల్లి డిసెంబర్ 26(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి అయ్యప్ప ఆలయంలో ఈరోజు పదునెట్టాంబడి పూజ ఘనంగా జరిగింది. దండు మోహన్ గురు స్వామి 37 వ సంవత్సర దీక్ష సందర్భంగా అయ్యప్ప స్వామికి కేశవ్ గురు స్వామి ఆధ్వర్యంలో అభిషేకము, లక్ష పుష్పార్చన, పల్లకిసేవ, మంగళ హారతులు చేశారు. స్వాములకు, భక్తులకు, మహిళలకు అన్నదానం ఏర్పాటు చేశారు. సచ్చిదానంద సరస్వతి స్వామి, బ్రహ్మశ్రీ యామవరం అనంత కృష్ణ వాజపేయి యాజీ, మణికంఠ శర్మ పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో వేధింపులు: బిఆర్ఎస్ నేత శ్రీనివాస్



**శంకర్పల్లి డిసెంబర్ 26:(డైలీ రిపోర్ట్):** హామీల అమలు కోసం ప్రశ్నిస్తున్నందునే అరెస్టులు చేస్తున్నారని, అక్రమ కేసులు పెట్టి వేధించాలని చూస్తున్నారని శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగయ్య గారి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ఎర్రోళ్ల శ్రీనివాస్ ను బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. అడిగితే అరెస్టులు.. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే బెదిరింపులు.. ఇది ఇందిరమ్మరాజ్యమా? పోలీస్ రాజ్యమా? అంటూ శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. అక్రమ అరెస్టుకు భయపడేవారు ఎవరూ లేరని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్

## కేసులతో భయపెట్టలేరని విమర్శలు

## ఇచ్చిన హామీలపై శ్రద్ధ పెట్టాలన్న వేముల



**నిజామాబాద్:** ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయే తప్ప ఏ రంగం పైనా శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు సినీ హీరో అల్లు అర్జున్ మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా రాక, రుణమాఫీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నందుకే రేవంత్ సర్కారు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నదని వేముల మండిపడ్డారు. కేసులతో తమ గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు.కేటీఆర్‌పై నమోదు చేసిన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని గురువారం విమర్శించారు. ఈ రకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బీఆర్ఎస్ నేతల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. కేటీఆర్ అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుడుతున్నదని, ప్రజా సమస్యలపై ఆయన సాగిస్తున్న పోరాటాలకు భయపడి కేసులతో వేధిస్తున్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పోరాడుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించాలని ఃాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని బనాయిస్తున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి.. క్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడడం రాజకీయ అమాయకత్వం తప్ప మరొకటి కాదు. కేసీఆర్ సైనికులం, తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టుకొచ్చిన మమ్మల్ని మీ చిల్లర వ్యూహాలు భయపెట్టలేవు. పోరాటం మాకు కొత్త కాదు. అక్రమ కేసులతో గొంతు నొక్కలేరని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా హామీలు అమలుచేయలేక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని అన్నారు.

# ఘనంగా టీడీపీ యువనేత బోధన బోయిన అరుణ్ యాదవ్ జన్మదిన వేడుకలు





**గిద్దలూరు ,డిసెంబర్ 26 (డైలీ రిపోర్ట్):** గిద్దలూరు మండల టీడీపీ యువ నాయకుడు బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు బోధన బోయిన అరుణ్ యాదవ్ జన్మదిన సందర్భంగా గిద్దలూరు లో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ముందు ముందు ఇంకా ఎన్నో పుట్టినరోజు చేసుకుంటూ అలాంటి నాయకుడు రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదగాలని గిద్దలూరు మండల టీడీపీ యువ నాయకుడు బోధన బోయిన అరుణ్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాదాపూర్ ట్రాఫిక్ డిసిపి గా సాయి మనోహర్ నియామకం



**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్:** మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ గా డిసెంబర్ 16 న పదోన్నతి పొందిన సాయి మనోహర్ గురువారం నాడు తన బాధ్యతలు స్వీకరించారు.తన పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. 1996 లో పోలీస్ శాఖలో సబ్ ఇన్స్ పెక్టర్ గా విధుల్లో చేరిన సాయి మనోహర్ అంచెలంచెలుగా ఎదుగుతూ పదోన్నతులు పొందుతూ ఈ రోజు డిసిపి స్థాయికి చేరుకున్నారు సైబరాబాద్ లిమిట్స్ లో కీలక ప్రాంతమైన మాదాపూర్ జోన్ ట్రాఫిక్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ గా డిసెంబర్ 16 న పోలీస్ శాఖ నియమించిన విషయం తెలిసిందే ఈ నేపథ్యం లో ఆయన ఈ రోజు బాధ్యతలను స్వీకరించారు ఈ సందర్భంగా సాయి మనోహర్ మాట్లాడుతూ మాదాపూర్ జోన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తానని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని అన్నారు డిసిపి గా బాధ్యతలు స్వీకరించిన సాయి మనోహర్ కు పోలీస్ అధికారులు. సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలి




**నందిగామ బ్యూరో , డిసెంబర్ 26 (డైలీ రిపోర్ట్):** రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా నందిగామ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడుతూ.గత సమ్మె కాలపు హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు డిమాండ్ చేస్తుంది. మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని. ఎస్సీ ఎస్టీ కరెంటు బిల్లులు ఫ్రీ అయితే మున్సిపల్ కార్మికులు మాత్రం కట్టాలని అని బిల్లులు వస్తున్నాయి కావున రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు కూడా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ గుర్తించాలని . మున్సిపల్ పట్టణ జనాభా పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్యను పెంచాలని.. కార్మికులు పెట్టుకునే విధానంలో కూడా ప్రస్తుతం పని చేస్తున్న కుటుంబాల నుండి కార్మికుల్ని తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పూట మాణిక్యం, గరికపాటి ప్రసాద్, రూత్తుమ్మ, పిచ్చయ్య, సతీష్, భుషి, బేబీ, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.





# పోరాటయోధుడు,పేదల ఆరాధ్యదైవం
# కామ్రేడ్ కెవల్ కిషన్..

**ప్రజలు ఒక వ్యక్తిని అభిమానిస్తే, గుండెల్లో పెట్టుకుని కొలుస్తారు అనడానికి నిదర్శనమే కెవల్ కిషన్..**

**ఆయన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి..... నీలం మధు ముదిరాజ్..**





సంగారెడ్డి /పటాన్ చెరువు డిసెంబర్ 26(డైలీ రిపోర్ట్): పేదల సంక్షేమం కోసం పరితపించిన పోరాట యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు అన్నారు.మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో స్వర్గీయ కేవల్ కిషన్ ముదిరాజ్ స్మారకర్తము ఆయన సమాధి వద్ద ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్,ఎం ఎల్ సి శుభాష్ రెడ్డి,తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, కెవల్ కిషన్ కూతురు డాక్టర్ వీణ కుమారి గార్లతో కలిసి నీలం మధు పాల్గొని ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు కేవల్ కిషన్ అన్నారు. మెదక్ ప్రాంతంలోని జమిందారుల ఆగడాలతో విసిగి వేసారిన పేదలను ఒక్కటి చేసి ప్రజాపోరాటాలు నిర్వహించారని తెలిపారు.దున్నేవాడికే భూమి అంటు భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిపెట్టారని కొనియాడారు.అలాగే కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి హక్కుల సాధనకు కృషి చేశాడన్నారు. అలాంటి మహనీయున్ని ప్రజలు స్మరించుకుంటు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతూ జాతరను చేయడం ప్రశంసనీయమని తెలిపారు. ప్రజల కోసం జీవించి ప్రాణాలర్పించిన మహనీయులని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకొని కొలుస్తారనడానికి నిదర్శనమే కెవల్ కిషన్ పోరాటం అన్నారు. అలాంటి మహనీయుని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పుట్టి అక్షయ్, మాజీ సర్పంచ్ సత్యం,స్వరూప, సత్యనారాయణ, గోపాలకృష్ణ, శ్రీకాంత్,శివన్న, బోయిని అరుణ, %ఎజఖ% శివ, %ాఖ% సంతోష్,దుబ్బాక భాస్కర్,జలిగారి ఎట్టయ్య, సుంకరబోయిన మహేష్, నారబోయిన శ్రీనివాస్,పిల్లుట్ల గంగాధర్, సదుల్నగర్ కృష్ణ, సత్యం, మణిదీప్,తలారి భిక్షపతి, ఉత్సవ నిర్వాహకులు, తధితరులు పాల్గొన్నారు.

## డ్రా లో బుల్లెట్ బండిని గెలుపొందిన ఓటాయి వాసి




కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారిచే రాష్ట్ర వ్యాప్తంగా ర్వహించిన గ్రోమోర్ రైతు సంబరాలలో ఉత్పత్తులు భాగంగా కోరమండల్ 20-20- 0 -13 మరియు 16-20-0-13 కు సంబంధించి డ్రా లో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయిగ్రామానికి చెందిన మాలోతు గణేష్ అనే రైతు కి బుల్లెట్ బైక్ డ్రాలో గెలవడం జరిగింది వాహనాన్ని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి . జోనల్ మేనేజర్ సుజన్ కుమార్ తో కలిసి బహుమతి అందజేశారు మహాలక్ష్మి ఎంటర్ప్రైజెస్ పబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూరాష్ట్రవ్యాప్తంగా తీసిన డ్రా లో కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి రావడం గర్వించదగ్గ విషయం అని అన్నారు రైతుల లైసెన్సు కలిగి ఉన్న డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే కంపెనీ నుండి వచ్చే స్కీములు ఇన్సూరెన్స్ లు రైతులు అవకాశం వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ నరేష్ గారు ,సీనియర్ అగ్రణమిస్ట్ వినోద్ గారు మరియు డిస్ట్రిబ్యూటర్ మహాలక్ష్మి ఎంటర్ప్రైజెస్ ఓటాయి పబ్బశ్రీనివాస్ .వెంశెట్టి సోమయ్య .డీలర్ లు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసం చట్టాల్లో మంచి మార్పులు వచ్చాయి, సీఐ శ్రీనివాస్ గౌడ్




**శంకర్ పల్లి డిసెంబర్ 26:(డైలీ రిపోర్ట్):**ఆడపిల్లలపై చిన్నారులపై గౌరవం చూపుకున్న పరవాలేదు కానీ అగౌరవపరిచి హింసను కలిగిస్తే చట్ట ప్రకారం జైలుకెళ్లడం ఖాయమని శంకర్ పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. గురువారం నాడు స్థానిక మోహన్ ఫంక్షన్ హాల్లో ఎంవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల మానసిక హింస అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తసంబంధికులని మన ఇంటి వారే అని ఆడపిల్లలను పట్టుకొని తిట్టి కొడితే బాధితులు స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేస్తే పోక్సో చట్టం కింద జైలుకు వెళ్లే చట్టాలు కొత్తగా వచ్చాయన్నారు . కాబట్టి ఆడపిల్లల జోలికి వెళ్ళొద్దని కూడా వారికి సహాయం చేసే విధంగా సహాయం చేసే విధంగా ధైర్యం ఇచ్చే విధంగా చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఆడపిల్లలు నేటి సమాజంలో ధైర్యంగా ఉండాలంటే చదువుకోవాలని తద్వారా చట్టాల గురించి తెలుస్తాయన్నారు. ఎంవి ఫౌండేషన్ కోఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ బాలికల సంఘాల ఏర్పాటు అదేవిధంగా మండల జిల్లా స్థాయి ఆడపిల్లల సమానత్వ కమిటీ టి ఎ స్ స్ ఏర్పడి చాలా సమస్యలు పరిష్కరించామని అన్నారు . ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్,ఐసిడిఎస్ సుప్రవేజర్ రేవతి , చేవెళ్ల టీం ప్రతినిధి, ప్రమీల, మధర్స్ కమిటీ అధ్యక్షులు జిల్లా కమిటీ, సభ్యులు, మానస, భవ్య, పద్మ, మరియు ఏం వి ఫౌండేషన్ ప్రతినిధులు, నాగమణి ,మంగమ్మ ఆశీర్వాదములు పాల్గొన్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707